క్లుప్తంగా

సింహాచలం ఆర్టీసీ కాంప్లెక్స్‌ను సందర్శించిన ఈడీ



సింహాచలం ఆర్టీసీ కాంప్లెక్స్‌లో అధికారులకు సూచనలిస్తున్న ఈడీ రవికుమార్

సింహాచలం: సింహాచలం ఆర్టీసీ కాంప్లెక్స్‌ను ఆదివారం సాయంత్రం ఏపీఎస్ ఆర్టీసీ జోన్-1 ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సి.రవికుమార్ సందర్శించారు. బస్టేషన్‌లో స్టాల్స్, పార్సిల్ పాయింట్‌ను తనిఖీ చేశారు. పార్సిల్ పాయింట్‌ను ప్రయాణికులు, వ్యాపారస్తులు, సింహాచలం పరిధిలోని ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. పార్సిళ్లు జాగ్రత్తగా తీసుకు వెళ్లాలని డ్రైవర్లకు సూచించారు. అలాగే క్రాస్ రోడ్డులో పార్సిల్ పాయింట్ బుకింగ్ అండ్ డెలివరీకి చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ బి.అప్పలనాయుడు, సింహాచలం డిపో మేనేజర్ రాజశేఖర్, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ తులసి, కొండలరావు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

ఆలయ చైర్మన్ ఇంట్లో అగ్నిప్రమాదం



ప్రమాదం జరిగిన ఇంటిని పరిశీలిస్తున్న కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ

మద్రిపాలెం: జీవీఎంసీ 51వ వార్డు అంబేడ్కర్ కాలనీలోని ఓ ఇంట్లో షార్ట్‌సర్క్యూట్ వల్ల అగ్నిప్రమాదం సంభవించింది. ఈ సంఘటనకు సంబంధించి వివరాలిలా.. స్థానిక పైడితల్లి అమ్మవారి ఆలయ చైర్మన్, డ్యాన్స్ మాస్టర్ పక్కి సాయికుమార్ అంబేడ్కర్ కాలనీలో నివసిస్తున్నారు. ఆదివారం మధ్యాహ్నం ఆయన ఇంట్లో విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ వల్ల ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ఈ ప్రమాదంలో ఇల్లు దగ్ధమైంది. విషయం తెలుసుకున్న కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ అక్కడికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. విషయాన్ని వెంటనే వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు దృష్టికి తీసుకెళ్లి సాయికుమార్‌కు అండగా ఉంటామని హామీ ఇచ్చారు.

నేడు బ్రాహ్మణ, పురోహితుల ఆత్మీయ సదస్సు

సింహాచలం: విశాఖ కేంద్ర బ్రాహ్మణ అర్చక, పురోహిత సేవా సమాఖ్య ఆధ్వర్యంలో సోమవారం బ్రాహ్మణ, అర్చక, పురోహితుల ఆత్మీయ సదస్సు వేపగుంట వెళ్లే బీఆర్‌టీఎస్ రోడ్డులోని వి ఫంక్షన్ హాల్‌లో నిర్వహిస్తున్నట్టు సమన్వయకర్త విజయ్‌కుమార్‌శర్మ తెలిపారు. ఉదయం 11 గంటలకు ప్రారంభమయ్యే సదస్సులో అర్చక, పురోహితుల సమస్యలు, వాటి పరిష్కారం కోసం తీసుకోవాల్సిన చర్యలపై ఏకగ్రీవ తీర్మానం చేస్తామన్నారు. విశాఖలోని అన్ని బ్రాహ్మణ సంఘాల ప్రతినిధులు హాజరు కావాలని కోరారు.

రైల్వే పార్కులు ప్రజలందరివీ..

తాటిచెట్లపాలెం: రైల్వేస్టేషన్ అంటే రైల్వేది మాత్రమే కాదని ప్రజలందరిదని, రైల్వే పార్కులు కూడా కేవలం రైల్వే వాళ్ల కోసం మాత్రమే కాదని ప్రజలందరి ఆరోగ్యం కోసం ఏర్పాటు చేసినవని రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నరసింహారావు అన్నారు. ఆదివారం ఉదయం రైల్వే వాకర్స్ పార్క్‌లో ఆయన పర్యటించి వాకర్స్ సమస్యలను తెలుసుకున్నారు. రైల్వే పార్క్ గేట్ తాళాలు వేసి, పార్క్‌ను మూసివేయడంపై జీవీఎల్ స్పందించారు. తక్షణమే డీఆర్ఎంతో మాట్లాడి గేట్ తాళాలు తెరిపించడానికి ప్రయత్నిస్తానని తెలిపారు. ఈ పార్క్‌లోని అమ్మవారి గుడికి కూడా తాళాలు వేయడం భావ్యం కాదని, ఎంపీగా, జోనల్ రైల్వే యూజర్స్ కన్సల్టేటివ్ కమిటీ మెంబర్‌గా రైల్వే అధికారులతో మాట్లాడి గుడిని తెరిపించేందుకు కృషి చేస్తానన్నారు.

రోడ్లపై దుకాణాలు.. నిత్యం ఇబ్బందులు



మల్కాపురం పోలీస్ స్టేషన్ ఎదురుగా ఉన్న రోడ్డుపై పార్క్ చేసిన వాహనాలు



మల్కాపురం నుంచి సింథియాకు వెళ్లే రోడ్డుపై ఏర్పాటు చేసిన దుకాణాలు

సింథియా: పారిశ్రామిక ప్రాంతంలో శ్రీహరిపురం నుంచి సింథియా వరకు రోడ్లపై దుకాణాలు విచ్చలవిడిగా ఏర్పాటయ్యాయి. దీంతో ఆ ప్రాంతమంతా నిత్యం రద్దీగా మారుతోంది. ఫలితంగా తరచూ ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. వాహనాలు సైతం పార్కింగ్ చేసుకోవడానికి చోటు లేక వినియోగదారులు తమ వాహనాలను రోడ్లపైనే పార్కింగ్ చేస్తున్నారు. సెలవు రోజుల్లో ఈ సమస్య మరింత ఎక్కువగా ఉంటోంది. కరోనా ఆంక్షలు ఎత్తివేసినా రోడ్డుపైనే వ్యాపారాలు సాగిస్తుండడంతో ట్రాఫిక్ సమస్య రోజురోజుకూ జటిలమవుతోంది.

అధికారుల ఆదేశాలు బేఖాతర్

జీవీఎంసీ అధికారులు రోడ్డుకు ఇరువైపులా వ్యాపారాలు చేస్తున్న వారిని ఖాళీ చేయిస్తూ మళ్లీ అదే పరిస్థితి ఉంది. మార్కెట్‌ల్లో దుకాణాలు ఉన్న వారు సైతం రోడ్లపైనే వ్యాపారాలు సక్రమంగా సాగుతున్నాయంటూ అక్కడే ఉండడంతో సమస్యకు పరిష్కారం లభించడంలేదు. రోడ్లపై దుకాణాలు ఏర్పాటు చేయడం వల్ల రాకపోకలకు ఇబ్బందిగా ఉందని స్థానికులు చెబుతున్నారు. గాజువాక నుంచి సింథియా మీదుగా నగరానికి వెళ్లడానికి రోజు వందలకొద్దీ వాహనాలతో పాటు ప్రజలు ప్రయాణిస్తుంటారు. అయితే ఈ రోడ్డులోనే కోరమాండల్, హెచ్‌పీసీఎల్ సంస్థలకు వచ్చే భారీ వాహనాలు సైతంపార్కింగ్ చేసి రోజుల తరబడి ఉంచడంతో ట్రాఫిక్ కష్టాలు తప్పడం లేదు. ట్రాఫిక్ పద్మవ్యూహం నుంచి ఎలా తప్పించుకోవాలో తెలియక ప్రజలు సతమతమవుతున్నారు. రోడ్లపై పార్కింగ్ చేస్తున్న వాహనాలకు జరిమానాలు విధిస్తున్నా... వ్యాపారాలు సాగిస్తున్న వారికి అవగాహన కలిగిస్తున్నా మార్పు రావడం లేదని అధికారులు తలలు పట్టుకుంటున్నారు.

ఇబ్బందులు పడుతున్నాం



మా ప్రాంతంలో రోడ్డుపైనే దుకాణాలు నిర్వహించడంతో నిత్యం ఇబ్బందులు పడుతున్నాం. రోడ్డు ఇరుగ్గా మారి వాహనాలు నిలిచిపోతున్నాయి. కరోనా ఆంక్షలు ఎత్తివేసినా వ్యాపారులు రోడ్లపైనే వ్యాపారాలు సాగిస్తున్నారు. అధికారులు స్పందించి చిరు వ్యాపారులకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసి ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చూడాలి.

– మజ్జి మాలినాయుడు, దుర్గానగర్

నిత్యం రద్దీ



దుకాణాల వద్ద కొనుగోలు చేయడానికి వచ్చే వారితో ఈ ప్రాంతం నిత్యం రద్దీగా ఉంటోంది. దీనికి తోడు వాహనాలను రోడ్డు మీదే పార్కింగ్ చేయడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. రోజురోజుకు దుకాణాలు ఏర్పాటు చేసే వారి సంఖ్య పెరుగుతూనే ఉంది. అధికారులు వీటిపై చర్యలు తీసుకుని ట్రాఫిక్‌ను నియంత్రించాలి.

– దాసరి రవి, ప్రకాష్‌నగర్

చర్యలు తీసుకుంటున్నాం

రోడ్డుపై వ్యాపారాలు సాగిస్తున్న వారిని గుర్తించి కేసులు నమోదు చేస్తున్నాం. మార్కెట్‌లో వ్యాపారాలు చేసుకునేలా దుకాణదారులకు అవగాహన కలిగిస్తున్నాం. కొనుగోలుదారులకు సైతం అవగాహన కలిగిస్తూ రోడ్డుపై వ్యాపారం చేసే వారి వద్ద క్రయవిక్రయాలు చేయకుండా నిలువరిస్తున్నాం. నో పార్కింగ్ బోర్డులు సైతం ఏర్పాటు చేస్తున్నాం. త్వరలోనే సమస్యను పరిష్కరించి ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా చూస్తాం.

– తులసీరావు, మల్కాపురం ట్రాఫిక్ సీఐ

విశాఖపై సీఎం జగన్‌కు ప్రత్యేక అభిమానం

కార్పొరేటర్ బల్ల లక్ష్మణరావు



సమావేశంలో మాట్లాడుతున్న కార్పొరేటర్ బల్ల లక్ష్మణరావు

సింథియా: విశాఖపట్నం అంటే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రత్యేక అభిమానం ఉందని.. అందుకే నగరం అభివృద్ధిపై ప్రత్యేక దృష్టిసారించారని కార్పొరేటర్ బల్ల లక్ష్మణరావు అన్నారు. జీవీఎంసీ 62వ వార్డు అంబేడ్కర్‌కాలనీలోని పార్టీ కార్యాలయంలో ఆదివారం ఆయన వైఎస్సార్‌సీపీ ముఖ్యనాయకులు, సచివాలయ కన్వీనర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆగస్టు 1వ తేదీన విశాఖ పర్యటనకు వస్తున్న సందర్భంగా ఘన స్వాగతం పలికేందుకు నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలి రావాలని సూచించారు.

మణిపూర్ మారణకాండపై నిరసన



నిరసన తెలుపుతున్న సంఘ సభ్యులు

సింథియా: మణిపూర్ మారణకాండను నిరసిస్తూ షెడ్యుల్ కులాల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మల్కాపురం ప్రకాష్‌నగర్ ఏడుగుళ్ల సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మణిపూర్‌లోని గిరిజన ఆదివాసీలపై జరుగుతున్న హత్యలు, హత్యాచారాలు రాజ్యాంగ హక్కులను కాలరాయడమే అవుతుందన్నారు. మణిపూర్‌లో జరుగుతున్న సంఘటనలు ప్రజాస్వామ్యానికే సిగ్గుచేటు అని, ఘటనకు భాధ్యత వహించి రాష్ట్రపతి వెంటనే స్పందించి, శాంతిబద్రతలు నెలకొల్పేందుకు చర్యలు చేపట్టాలని కోరారు. లేని పక్షంలో ప్రజలే తమ ఓటు హక్కుతో గట్టి బుద్ధి చెప్తారని హెచ్చరించారు. నిరసన కార్యక్రమంలో ప్రకాష్‌నగర్ షెడ్యూల్ కులాల సంక్షేమ సంఘం అధ్యక్షులు షోలే, కార్యదర్శి గుడాల శంకరరావు, ట్రెజరర్ శ్రీధర్, గాంధీ, అన్నవరం సిద్ధార్థ, యూవీ రావ్ తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల వేధింపుల నుంచి కాపాడండి

దాబాగార్డెన్స్: కుటుంబంలోని వివాదాల కారణంగా తమకు న్యాయం చేయమని పోలీస్ స్టేషన్‌కు వెళ్తే.. కనీసం తాము ఇచ్చిన ఫిర్యాదు ను పట్టించుకోకుండా పోలీసులు తిరిగి కేసులు నమోదు చేయడం అన్యాయమని బాధితుడు దువ్వాడ నాగరాజు వాపోయాడు. తనకు జరిగిన అన్యాయాన్ని మీడియాకు ఆదివారం తెలిపాడు. సింధియా న్యూకాలనీ చింతలవాని గ్రామంలో 40 ఏళ్లుగా నివసిస్తున్నానని, కుటుంబంలో తాతయ్య, మేనత్తల మధ్య నెల కొన్న భూ వివాదాల కారణంగా తనను తన తండ్రి నిర్మించిన ఇంటి నుంచి బయటకు పంపించేశారంటూ భార్యతో కలిసి మల్కాపురం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశానన్నారు. దీనిని కనీసం పోలీసులు పట్టించుకోకుండా తనపై తప్పుడు కేసులు పెట్టారని ఆరోపించారు. స్టేషన్ హెడ్‌కానిస్టేబుల్, ఎస్ఐ దేవుడమ్మ, సీఐ దేవుడుబాబు ఇష్టానుసారంగా తనను అవమానపరిచేలా వ్యాఖ్యలు చేశారన్నారు. తనకు జరిగిన అన్యాయంపై గత ఏప్రిల్ 19న స్టేషన్‌లో ఫిర్యాదు చేసినప్పటికీ, ఆ ఫిర్యాదును పట్టించుకోకుండా పదే పదే స్టేషన్‌కు పిలుస్తూ తనపై తప్పుడు కేసులు బనాయించారంటూ బాధితుడు ఆరోపించాడు. తాను సీనియర్ న్యాయవాది చరపల్లి సత్యారావు వద్ద కారు డ్రైవర్‌గా పనిచేస్తున్నానని, ఆయనతో కలిసి వెళ్లి ఫిర్యాదు చేసినా స్పందించలేదన్నారు. తనకు జరిగిన అన్యాయంపై పోలీసు ఉన్నతాధికారులు స్పందించి న్యాయం చేయాలని కోరారు. సీనియర్ న్యాయవాది సత్యారావు తదితరులు పాల్గొన్నారు.

ఎర్నిమాంబకు ప్రత్యేక పూజలు



ఎర్నిమాంబకు హారతి సమర్పిస్తున్న అర్చకులు

కంచరపాలెం: జ్ఞానాపురం పరిధి కాన్వెంటు కూడలిలో వెలసిన ఎర్నిమాంబ అమ్మ వారి ఆలయం అధిక శ్రావణ మాస శుద్ధ ద్వాదశి ఆదివారాన్ని పురస్కరించుకుని భక్తులతో కిటకిటలాడింది. ఆలయ పూజారమ్మ వాసుపల్లి విజయమ్మ అమ్మవారిని ప్రత్యేకంగా అలకంరించారు. ఆలయ ప్రధాన అర్చకులు పులఖండం శ్రీకాంత్ శర్మ ఉదయం నుంచి అమ్మవారికి కుంకుమ పూజలు, విశేషార్చనలు, అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు ప్రత్యేక ఉచిత దర్శనాలు ఏర్పాటు చేశారు. ఆలయ పరిసరాల్లో భక్తులు వంటా వార్పు చేసుకుని మొక్కులు చెల్లించుకున్నారు. దేవదాయ శాఖ ఈవో డీవీఎస్ సురేష్‌బాబా, సిబ్బంది భక్తుల సౌకర్యాలను పర్యవేక్షించారు.

ఏయూ సమాచారం..

ఆశావాద దృక్పథంతో సాగాలి



పవన్‌కుమార్ మిశ్రాను సత్కరిస్తున్న రెక్టార్ ఆచార్య సమత

ఏయూ క్యాంపస్: విద్యార్థులు ఆత్మవిశ్వాసం, ఆశావాద దృక్పథంతో అడుగేయాలని ఏయూ రెక్టార్ ఆచార్య కె.సమత సూచించారు. ఆదివారం ఉదయం ఏయూ ప్లాటినం జూబ్లీ సమావేశ మందిరంలో ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ లోకల్ సెల్ఫ్ గవర్నమెంట్ నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఆధ్యాత్మికత వ్యక్తిని ఉన్నతంగా, దృఢంగా ఎదగడానికి దోహదపడుతుందన్నారు. లివింగ్ హనుమాన్ పుస్తక రచయిత డాక్టర్ పవనకుమార్ మిశ్రా మాట్లాడుతూ ప్రతి వ్యక్తి ఆధ్యాత్మిక భావాలు, మేధస్సును కలిగి ఉంటూ కర్మయోగిగా మారాలని సూచించారు. కార్యక్రమంలో సెంటర్ ఫర్ ఎమోషనల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ డాక్టర్ చల్లా కృష్ణవీర్ అభిషేక్, వేదాంత ఇన్‌స్టిట్యూట్‌కు చెందిన డాక్టర్ ఎస్.సత్యనారాయణ, బిరేందర్ సింగ్ ఫరొత్యల్, బి.వి.కె.చైతన్య, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పవన్ కుమార్ మిశ్రాను స్పిరిచ్యువల్ సైంటిస్ట్ అవార్డుతో సత్కరించారు. ఈ సందర్భంగా అభిషేక్ రచించిన లార్డ్ హనుమాన్-రామ్‌కుక్కురా పుస్తకాన్ని అతిథులు ఆవిష్కరించారు.

ప్రకృతిలో ప్రతి మొక్కకు ఓ ప్రత్యేకత



మొక్కల ప్రత్యేకతలను వివరిస్తున్న డాక్టర్ ప్రకాష్

ఏయూ క్యాంపస్: ప్రకృతిలో మనం నిత్యం చూసే ప్రతి మొక్కకు ఓ ప్రత్యేకత ఉందని ఏయూ వృక్ష శాస్త్ర విభాగ పరిశోధకుడు డాక్టర్ ప్రకాష్ అన్నారు. ఆదివారం ఉదయం విభాగంలో నిర్వహించిన మొక్కలపై అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. దేశీయంగా పెరిగే మొక్కలు, విదేశాల నుంచి తెచ్చి అభివృద్ధి చేసిన మొక్కలు, ఔషధ మొక్కలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విభాగంలో మ్యూజియంలో భద్రపరిచిన వివిధ మొక్కల ప్రత్యేకతలు, విశిష్టతలను ఆయన వివరించారు.

గురిపెడితే.. తప్పకూడదు..



ఆయుధాలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎన్‌సీసీ అధికారి

ఏయూ క్యాంపస్: దేశ రక్షణలో యువత అడుగిడాలి. భరతమాత రక్షణకు నడుంబిగించాలి. యువతీ యువకులు దేశ త్రివిధ దళాలలో చేరాలి. దీనికి తొలి అడుగుగా నేషనల్ కేడెట్ కాప్స్ నిలుస్తుంది. కళాశాల స్థాయిలో విద్యార్థులను ఎన్‌సీసీలో భాగస్వాములను చేస్తూ క్రమశిక్షణ, దేశభక్తి, యుద్ధ మెలకువలు నేర్పిస్తారు. దీనిలో భాగంగా ఆంధ్ర విశ్వవిద్యాలయం ఎన్‌సీసీ ఆధ్వర్యంలో ఏయూ అవుట్‌గేట్ వద్ద ప్రతి ఆదివారం విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇస్తారు. ఇలా ఈ ఆదివారం కూడా విద్యార్థులకు తుపాకీల వినియోగంపై ఎన్‌సీసీ అధికారులు అవగాహన కల్పించారు. విద్యార్థులకు నమూనా తుపాకులు అందించి ప్రత్యక్షంగా శిక్షణ ఇచ్చారు.

వైభవంగా ఆర్జిత సేవలు



తలంబ్రాల ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు


సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామికి ఆదివారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 7 నుంచి స్వర్ణపుష్పార్చన నిర్వహించారు. స్వామివారి ఉత్సవ మూర్తులు గోవిందరాజ స్వామి, శ్రీదేవి, భూదేవిలను ఆలయ కల్యాణమండపంలోని వేదికపై అధిష్ఠంపజేశారు. ఉభయదాతలను స్వర్ణ పుష్పాలతో ప్రదక్షిణ చేయించారు. అష్టోత్తర శతనామావళి పఠిస్తూ 108 స్వర్ణపుష్పాలతో అర్చన చేశారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు. ఆలయ సూపరింటిండెంట్ సునీల్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

విశేషంగా నిత్య కల్యాణం.. శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం నిత్య కల్యాణం విశేషంగా జరిగింది. ఉదయం 9.30 గంటల ఈకార్యక్రమం నిర్వహించారు. ఆలయ కల్యాణమండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను అధిష్ఠంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనంతో క్రతువు ప్రారంభించారు. సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



జ్యోతి వెలిగించి యోగా పోటీలు ప్రారంభిస్తున్న శ్రీకాంత్, వెంకటరమణ



యోగా చేస్తున్న చిన్నారులు

సీతమ్మధార: యోగా సాధనతో సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉండొచ్చని కోరమండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ సీనియర్ మేనేజర్ కె.శ్రీకాంత్ అన్నారు. విశాఖ యోగా స్పోర్ట్స్ అసోసియేషన్ విశాఖపట్నం ఆధ్వర్యంలో ఆదివారం సీతమ్మధార నార్త్ ఎక్స్‌టెన్షన్‌లోని శ్రీకృష్ణ మందిరం ఆవరణలో యోగా పోటీలు నిర్వహించారు. వీటిని జాతీయ హ్యాండ్ బాల్ క్రీడాకారుడు ఎస్.వెంకటరమణతో కలిసి ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు యోగాతోపాటు అన్ని రంగాల్లో ముందుండాలని ఆకాంక్షించారు.

విజేతలు వీరే..

8 ఏళ్ల నుంచి 50 ఏళ్ల వయసు వరకు సుమారు 400 మంది యోగా పోటీల్లో పాల్గొన్నారు.

- సబ్ జూనియర్స్ విభాగంలో బి.జయశ్రీ ప్రథమ, సిహెచ్.తేజశ్రీ ద్వితీయ, ఎం.మౌళిక తృతీయ స్థానాల్లో నిలిచారు.
- జూనియర్స్ విభాగంలో కె.వెంకట వైష్ణవి ప్రథమ, బి.వైష్ణవి ద్వితీయ, హర్షవర్ధనిశ్రీ తృతీయ స్థానాలు సాధించారు.
- సీనియర్స్ విభాగంలో ఎన్.వి.రమణ ఫస్ట్, ఎస్‌కే అబ్దుల్ ఖాదర్ సెకెండ్, డి.మహేశ్వరరావు థర్డ్ ప్లేస్‌లో నిలిచారు. పోటీల అనంతరం ఆయా విభాగాల విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను అతిథులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో డాక్టర్ యు.రామారావు, డాక్టర్ ఎం.రవి శ్రీనివాస్, యోగా టీచర్లు పాల్గొన్నారు.

లలితా పీఠంలో ముగిసిన ప్రవచనాలు

సీతంపేట: అక్కయ్యపాలెం లలితానగర్ లలితా పీఠంలో వారం రోజులుగా జరుగుతున్న శ్రీలలితా లహరి సప్తాహ ప్రవచన కార్యక్రమం ఆదివారంతో ముగిసింది. శ్రీశక్తి పీఠాధీశ్వరి మాతా రమ్యానంద భారతీ స్వామిని చివరి రోజు ప్రవచనంలో భండాసురుని సంహారానికి లలితాదేవి అమ్మవారు చేసిన యుద్ధ ఘట్టాన్ని భక్తులకు కళ్లకు కట్టినట్టు వివరించారు. భండాసురుడు ప్రయోగించిన మహాసుర అస్త్రం, అమ్మవారి వేదశక్తిని నశింప జేసేలా ప్రయోగించిన సోమకాసుర అస్త్రం, హిరణ్యాక్ష అస్త్రం గురించి ప్రవచించారు. మత్స్య, కూర్మావతారాలతో ఈ అస్త్రాలను అమ్మవారు ఎదుర్కొన్న తీరును వివరించారు. లలితా పీఠాధిపతి సిద్ధేశ్వరానంద భారతీ మహాస్వామి సమక్షంలో జరిగిన ప్రవచన కార్యక్రమంలో పలువురు భక్తులు పాల్గొన్నారు. లలితా పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

ఈత కొడదాం రండి



మురళీనగర్ స్విమ్మింగ్ పూల్‌లో ఈత కొడుతున్న స్విమ్మర్లు

మురళీనగర్: మురళీనగర్ వైశాఖి స్పోర్ట్స్ పార్కుకు అనుబంధంగా ఏర్పాటు చేసిన ఆధునిక స్విమ్మింగ్ పూల్ ఔత్సాహిక క్రీడాకారులకు ప్రోత్సాహం అందిస్తోంది. నగరంలో ఇతర స్విమ్మింగ్ పూల్స్‌కు ఏమాత్రం తీసిపోని విధంగా ఇది అందరికీ అందుబాటులో ఉండేలా నిర్వాహకులు తీర్చిదిద్దారు. పిల్లలు, పెద్దలు, మహిళలకు స్విమ్మింగ్ నేర్పేందుకు అవసరమైన ఏర్పాట్లు చేశారు. నాణ్యతా ప్రమాణాలను పాటిస్తూ అందరి ఆదరణ పొందుతున్నారు.

ఇవీ నిబంధనలు

స్విమ్మింగ్ పూల్‌లో కోచింగ్ తీసుకోవాలంటే కనీసం 8 ఏళ్ల వయసు దాటి ఉండాలి. వారి చిరునామా వివరాలతో ఆధార్ కార్డు సమర్పించాల్సి ఉంటుంది. బ్యాచీకి గంట మాత్రమే సమయం కేటాయిస్తారు. ప్రతి బ్యాచీకి 40 మందిని అనుమతిస్తారు. అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వారిని, కండ్లకలక, జలుబు, దగ్గు వంటి సమస్యలు ఉన్న వారిని అనుమతించరు. స్విమ్మింగ్ డ్రస్, క్యాప్, గుల్స్‌తో రావాలి. యూపీఐ మోడ్‌లో ఫీజు చెల్లించాలి. నగదు తీసుకోరు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి. పీరియడ్స్ టైమ్‌లో మహిళలను అనుమతించరు. శరీరానికి క్రీములు రాసుకుని రాకూడదు. ఇలా వస్తే వారు బాత్‌రూమ్‌లో స్నానం చేసి రావాలి. విలువైన ఆభరణాలతో రాకూడదు.

సమయం.. ఫీజు వివరాలు

ప్రతి రోజూ ఉదయం 6–7 గంటలు, 7–8 గంటలు, సాయంత్రం 5–6, 6–7 గంటలు బ్యాచీలు ఉంటాయి. సాయంత్రం మహిళల కోసం ప్రత్యేకంగా 7–8 గంటలకు శిక్షణనిస్తారు. మహిళలు, పురుషులకు ప్రత్యేకంగా కోచ్‌లు అందుబాటులో ఉన్నారు. ప్రతి సోమవారం సెలవు.

- నెలకు రూ.700. జీవిత కాల సభ్యులకు రూ.300.

స్విమ్మింగ్ పూల్ నిర్వహణ

రోజూ రెండు సార్లు స్మిమింగ్ పూల్‌ను క్లీన్‌చేస్తారు. నీటిలో క్లోరిన్ కలుపుతారు. దీని రీడింగ్ కూడా చూస్తారు. వాటర్ హార్డ్‌నెస్ కూడా చూసి ఈతకు అనుమతిస్తారు.

- బాత్‌రూమ్స్ నిర్వహణ ఆధునికంగా ఉంటుంది. నాణ్యతా ప్రమాణాలు కచ్చితంగా పాటిస్తారు.

ప్రత్యేక శిబిరాలు

వేసవిలో ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు ఉంటాయి. ప్రతి ఏడాది ఏప్రిల్ నుంచి జూన్ వరకు ఎక్కువ మందికి అవకాశం ఉంటుంది. ఇప్పుడున్న బ్యాచీలకు అదనంగా ఉదయం సాయంత్రం ప్రత్యేకంగా ఒక బ్యాచీ ఉంటుంది.

ఈత పోటీలు

డెకాత్లాన్ ఆధ్వర్యంలో ఇక్కడ పోటీలు నిర్వహిస్తారు. ఇక్కడ శిక్షణ పొందిన స్విమ్మర్లలో చాలా మంది రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ముంబయిలో త్వరలో నిర్వహించనున్న జాతీయ స్థాయి పోటీలకు వీరు అర్హత సాధించారు.